

మెట్‌పల్లి: రైతు దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ శ్రేణులు

# రైతులకు అండగా బీఆర్ఎస్

- హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- రైతు దీక్షలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, ఏప్రిల్ 6: భారత రాష్ట్ర సమితి రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారి పక్కన తలపెట్టిన రైతు దీక్షకు భారీ స్పందన లభించింది. బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, బోనస్ చెల్లించాలని, ఎండిపోయిన పంటలను గుర్తించి బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఇంత వరకు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాకపోవడం, రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నదని విమర్శించారు. హామీల అమలు కోసం రైతుల పక్షాన ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్బీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ చీటి వెంకట్రావు, బీఆర్ఎస్ నాయకులు ఆకుల రాజారెడ్డి, ఆదిరెడ్డి, లింగంపల్లి సంజీవ్, నోముల లక్ష్మారెడ్డి, డీలర్ మల్లయ్య, తోట శ్రీనివాస్, ముదాం నర్సింహులు, యాళ్ల తిరుపతిరెడ్డి, ఒజ్జెల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలి

- ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేలు చెల్లించాలి • జగిత్యాల రైతు దీక్షలో జడ్పీ చైర్‌పర్సన్ వసంత



జగిత్యాల: రైతు దీక్షలో పాల్గొన్న దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 6: రైతులు పండించిన ధాన్యం క్వింటాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ అందించాలని, ఎండిన పంటకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు దీక్షలో జడ్పీ చైర్‌పర్సన్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం దావ వసంత మాట్లాడుతూ.. దండగన్న వ్యవసాయాన్ని రైతు బాంధవుడు కేసీఆర్ పండగలా చేస్తే, కాంగ్రెస్ హయాంలో కరెంట్, నీళ్లు లేక కన్నీళ్లే మిగిలాయన్నారు. పంట ఎండిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని, చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతులను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనన్నారు. వడ్లను కొనబోమని చెప్పింది బీజేపీ కాదా?అని నిలదీశారు. రైతుబంధు పడలేదన్నవారిని చెప్పుతో కొట్టాలని, మంత్రి రైతులను అవమానించాడన్నారు. కేసీఆర్ హయాంలో పంటలు పండడం తప్ప ఎండుడు లేదని, కాంగ్రెస్‌తోనే కరువొచ్చిందని వాపోయారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, రైతులకు మేలు చేసే దాకా బీఆర్ఎస్ పోరాడుతుందని, రైతులు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. రైతులెవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, అండగా తాముంటామని హామీ ఇచ్చారు. దీక్షలో జడ్పీటీసీలు మహేశ్, మనోహర్‌రెడ్డి, రాయికల్ ఎంపీపీ సంధ్యారాణి, జగిత్యాల రూరల్ వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, పార్టీ మండలాధ్యక్షులు బాలముకుందం, కొల శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, ఆర్బీఎస్ మండల కన్వీనర్ నక్క రవీందర్ రెడ్డి, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ పట్టణ, మండల కార్యవర్గం, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# అన్నదాతలను ఆదుకోవాలి

- ధర్మపురి రైతు దీక్షలో బీఆర్ఎస్ నాయకులు

ధర్మపురి, ఏప్రిల్ 6: కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్మపురి పట్టణంలోని హనుమాన్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం చేపట్టిన రైతు దీక్ష విజయవంతమైంది. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులతో దీక్ష స్థలి నిండిపోయింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. రైతుబంధు ఊసేలేదని, కరెంటు కోతలతో పాటు సాగునీరు లేక రైతులు అరిగోస పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సాగునీరందక పంట నష్టం జరిగిన రైతులకు రూ.25వేల పరిహారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్మపురి తహసీల్దార్ కృష్ణచైతన్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సౌళ్ల భీమయ్య, అయ్యోరి రాజేశ్‌కుమార్, చిలివేరి శ్యాంసుందర్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ధర్మపురి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలి

- వినోద్‌కుమార్ గెలుపునకు పాటుపడాలి
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్



గెల్లు శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానిస్తున్న పూడూర్ యూత్ సభ్యులు

కొడిమ్యాల, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ బలోపేతానికి యువత కృషి చేయాలని, ప్రజల కోసం కేసీఆర్ పాలనలో చేసిన పలు అభివృద్ధి పనులను వివరించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్యకర్తలకు సూచించారు. మండలంలోని పూడూర్ గ్రామంలో యూత్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 8న దేశరాజ్‌పల్లి వసుధ కన్వెన్షన్‌లో కరీంగనర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపుకోసం యువతకు నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని 24 గ్రామాల నుంచి 300 మంది యువకులు పాల్గొనాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఒకటై బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని కుట్ర చేస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ అభివృద్ధి కోసం ఎంపీగా ఉన్నప్పుడు వినోద్‌కుమార్ రూ.కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. బండి సంజయ్ ఒక్క రూపాయి తేలేదన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే వారిని పంపాలన్నారు. కార్యక్రమంలో యూత్ మండల నాయకులు గడ్డం లక్ష్మారెడ్డి, అనుమండ్ల అజయ్‌రెడ్డి తదితరులున్నారు.

# ఎమ్మెల్యేను పరామర్శించిన కేటీఆర్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తండ్రి ప్రముఖ న్యాయవాది మాకునూరి హన్మంతరావు అనారోగ్యంతో మృతిచెందగా, కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా హన్మంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తల్లిని ఓదార్చి ఆమెకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్



ప్రముఖ న్యాయవాది హన్మంతరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేటీఆర్

## ఆటో చక్రాల కింద నలిగి.. 16 నెలల చిన్నారి దుర్మరణం



సుధన్వన్ (ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 6: అప్పటి వరకు తల్లి ఒడిలో ఆడుకుంటున్న చిన్నారి ఆరు బయటకు వచ్చి ఆటో చక్రాల కింద పడి నలిగిపోయిన ఘటన ఆ కుటుంబంలో తీరని శోఖాన్ని మిగిల్చింది. కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన పొట్ట రిషీంద్ర – అపూర్వ దంపతుల కుమారుడు సుధన్వన్ (16 నెలలు) శనివారం ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. తాగు నీటి క్యాన్లను ఇంటింటికీ సరఫరా చేసే రాజేందర్ ఆటోను ఆజాగ్రత్తగా నడిపి చిన్నారిని ఢీ కొట్టాడు. ఆటో వెనుక చక్రాల కింద పడిన సుధన్వన్ తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన దవాఖానకు తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ముద్దులొలికే చిన్నారి మరణం అక్కడున్న వారిని కలిచి వేసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మరో వలస కార్మికుడి మృతదేహం లభ్యం

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 6: మెట్‌పల్లి మండలం చౌలమద్ది పెద్దవాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన మరో వలస కార్మికుడి మృతదేహం శనివారం లభ్యమైంది. మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి వివరాల ప్రకారం.. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 14 మంది కార్మికులు చౌలమద్ది పెద్ద వాగుపై జరుగుతున్న వంతెన పనులు చేసేందుకు వలస వచ్చారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలానికి చెందిన పూజారి శ్రీనివాస్(30), మంచిర్యాల జిల్లా భీమారం మండలం బూరుగుపల్లికి చెందిన మామిడి పోశయ్య(49) తోటి కార్మికులతో కలిసి వాగులో స్నానం చేసేందుకు వెళ్లారు. శ్రీనివాస్, పోశయ్య ప్రమాదవశాత్తు వాగులో పడిపోయారు. శ్రీనివాస్ మృతదేహం శుక్రవారం లభ్యం కాగా, పోశయ్య మృతదేహం శనివారం వాగులో లభ్యమైంది. మృతదేహానికి మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధం

కథలాపూర్, ఏప్రిల్ 6: భూషణరావుపేట శివారులో వరి పంటను హార్వెస్టర్‌తో కోస్తుండగా విద్యుత్ తీగలు దగ్ధమైన ఘటన శనివారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం...భూషణరావుపేటకు చెందిన భైర రవి తన హార్వెస్టర్‌తో గ్రామశివారులోని పుర్కుటపు శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వరి పంట కోస్తున్నారు. అదే పొలంలో పైన ఉన్న విద్యుత్ తీగలను గమనించకుండా యథావిధిగా పంటను కోస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్‌కు మంటలు అంటుకున్నాయి. నీళ్లు చల్లిన మంటలు అదుపులోకి రాలేదు. మెట్‌పల్లిలోని అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో రూ.4 లక్షల నష్టం జరిగినట్లు అగ్ని మాపక అధికారి మల్లికార్జున్ యాదవ్ పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి బాధితులను ఓదార్చారు. విద్యుత్ తీగలు వేలాడుతుంటే ట్రాన్స్‌కో అధికారులు అదనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు సరిచేయాలన్నారు. నష్టపోయిన బాధితుడికి ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

PASSPORT LOST

★Guguloth Gangadhar S/o. Ramulu, 5-131, Thukya Thanda, Chinthamani Thanda, Rudrangi Mandal, Rajanna Sircilla Dist. My passport No. X6020003 Lost by Travelling from Rudrangi to Metpally. If any found please call 93912 84906.
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

## పలువురికి అడ్లూరి పరామర్శ

ధర్మపురి, ఏప్రిల్ 6: ధర్మపురి పట్టణంలో వివిధ కారణాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా శనివారం వారి కుటుంబసభ్యులను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. పట్టణానికి చెందిన దూడ వెంకట్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా శనివారం కుటుంబసభ్యులను అడ్లూరి పరామర్శించారు. అలాగే పట్టణానికి చెందిన పాదం పెద్దన్న, ఆకుల చిన్నగంగన్న ఇటీవల మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

## పసుపు @ రూ.14,511

మెట్‌పల్లి, ఏప్రిల్ 6: పసుపు ధరలు మళ్లీ నిరాశపరుస్తున్నాయి. రోజు రోజుకు తగ్గుముఖం పడుతుండడంతో పంట సాగు చేసిన రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 14,511, కనిష్ఠంగా రూ.8,666, గోళకు గరిష్ఠంగా రూ.13,251, కనిష్ఠంగా రూ.7,5799, పసుపు చూరకు రూ.11,588, కనిష్ఠంగా రూ. 5,819 ధర పలికింది. ఈ ఒక్క రోజు కేవలం 360 క్వింటాళ్ల పసుపు మాత్రమే కొనుగోలు జరిగింది.

## శాంతి స్వరూప్ మృతికి సంతాపం

మెట్‌పల్లి, ఏప్రిల్ 6: దూరదర్శన్ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మృతికి మెట్‌పల్లి లలితా కళాసమితి సభ్యులు సంతాపం తెలిపారు. శనివారం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకు ముందు ఉగాది రంగస్థల నృత్యకేళికి సంబంధించిన పత్రికలను ఆవిష్కరించారు. నేడు మెట్‌పల్లిలోని ఎస్సారెస్పీ గార్డెన్స్‌లో శాస్త్రీయ జానపద నృత్యాలు, కళానాట్య విన్యాసాలు ఉంటాయని లలితా కళాసమితి అధ్యక్షుడు గంగాధర్ పేర్కొన్నారు.

## క్రికెట్ జెర్సీల ఆవిష్కరణ

మల్లాపూర్, ఏప్రిల్ 6: చిట్టాపూర్‌లో మాజీ ఉపసర్పంచ్ గడ్డం లింగారెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ జట్ల జెర్సీలను శనివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆవిష్కరించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం అన్ని మతాలను గౌరవించింది

మేడిపల్లి, ఏప్రిల్ 6 : గత ప్రభుత్వంలో తెలంగాణ మొదటి సీఎం కేసీఆర్ అన్ని మతాలు, కులాలను గౌరవించారని మైనార్టీ నాయకుడు ఎండీ గాజిపాషా పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రంజాన్ పండుగ వచ్చిందంటే గత ప్రభుత్వంలో ఇఫ్తార్ విందులు, దుస్తులు పంపిణీ చేసేవారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని వాపోయారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



జగిత్యాల రూరల్ మండలం కూసరివాడ వేడుకల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు



పెగడపల్లి: ఉప్పుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

జగిత్యాల రూరల్/రాయికల్/కొడిమ్యాల /పెగడపల్లి/కథలాపూర్, ఏప్రిల్ 6: జగిత్యాల రూరల్ మండలం కూసరివాడ, రాయికల్ మండలకేంద్రంతో పాటు ఇటిక్యాల, ధావన్ పల్లి, కొడిమ్యాల మండలం పూడూర్, నమిలకొండ, తుర్కాశీనగర్, పెగడపల్లి మండలం లింగాపూర్ అనుబంధ గ్రామమైన ఉప్పుపల్లి, కథలాపూర్ మండలం సిరికొండ, దుంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రీ స్కూల్‌కు వచ్చే పిల్లలకు అసెస్మెంట్ కార్డు అందించారు. తల్లులకు పిల్లల నైపుణ్యం, అభివృద్ధి, సృజనాత్మక కథలు, ప్రీస్కూల్ యాక్టివిటీస్, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలతో ఆటలు ఆడించి, పాటలు పాడించారు. చిన్నారులు వివిధ అంశాల్లో చూపిన ప్రతిభను తల్లిదండ్రులకు వివరించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కవితా రాణి , పద్మావతి, సుధా రాణి, మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ వేతనం పెరిగింది

కొడిమ్యాల, ఏప్రిల్ 6: ఉపాధి హామీ కూలీలకు దినసరి వేతనం రూ.272 నుంచి రూ.300 పెరిగిందని జిల్లా ఉపాధి హామీ అదనపు పీడీ మదన్‌మోహన్ పేర్కొన్నారు. మండలంలోని తిప్పాయిపల్లి, నమిలకొండలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మెజర్మెంట్ ప్రకారం కూలీలు పనులు చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సతీశ్, టెక్నికల్ అసిస్టెంట్లు భువన్, శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ సాగరిక, గడ్డం శేఖర్, తదితరులు ఉన్నారు.

## మేడిపల్లిలో ఇఫ్తార్ విందు

మేడిపల్లి, ఏప్రిల్ 6: రంజాన్ పండుగను పురస్కరించుకొని మేడిపల్లి రెండో ఎంపీటీసీ మకిలి దాస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లింలకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దేశవేని కృష్ణ, నాయకులు ఎండీ అన్సర్, అర్జున్, మహేందర్, ప్రభు, జంపి, శివ తదితరులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

రాయికల్, ఏప్రిల్ 6: ఎండకాలం దృష్ట్యా ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు అన్ని సదుపాయాలను కల్పించాలని జగిత్యాల డీఆర్డీవో (మండల ప్రత్యేకాధికారి) సంపత్ రావు సూచించారు. మండలం కిష్టంపేటలో జరుగుతున్న కందకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీల వేతనాలను ఏప్రిల్ నుంచి రూ.300 ప్రభుత్వం పెంచిందన్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మూడు నెలల్లో కూలీలు వంద రోజులు పని పూర్తి చేసినట్లయితే రూ.30వేల వేతనం పొందవచ్చన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలకు పని ప్రదేశంలో అన్ని సదుపాయాలు కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దివ్య, టెక్నికల్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, రాము, వేణు, అమర్, కార్యదర్శి వేణుగోపాల్, మేట్ కందుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- జడ్పీ సీఈవో రఘువరన్



ప్రభుత్వ దవాఖానలో ఓఆర్ఎస్ ప్యాకెట్ల వివరాలను తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారి జడ్పీ సీఈవో రఘువరన్ అధికారులను ఆదేశించారు. శనివారం గ్రామంలోని మంచినీటి బావిని పరిశీలించారు. మంచినీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ కలుపాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతుండడంతో నీటి నిల్వలు తగ్గే అవకాశం ఉందని ఎలాంటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రభుత్వ దవాఖానను పరిశీలించి ఓఆర్ఎస్ ప్యాకెట్ల నిల్వలుంచుకోవాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ప్రజలకు వడదెబ్బ తగలకుండా ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కథలాపూర్, ఏప్రిల్ 6: మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఆదివారం నిర్వహించే పరీక్షకు కథలాపూర్ మోడల్ స్కూల్‌లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ నరేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 7, 8, 9, 10వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు 124 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

## నలంద డిగ్రీ కళాశాలలో వీడ్కోలు

జగిత్యాల, ఏప్రిల్ 6: నలంద డిగ్రీ కళాశాల బీఎస్సీ, బీకాం, బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కడ ఉన్నా మీకు చదువు నేర్పిన గురువులకు, తల్లి దండ్రులకు మంచి పేరు తెచ్చేలా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐపీఎల్ రాజస్థాన్ రాయల్స్‌కు నెట్ బౌలర్‌గా ఎన్నికైన వంశీని, ఇటీవల ఇండియన్ నేవీకి ఎన్నికైన మనోజ్‌ను, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నలంద, ఎస్ఎస్‌వీ కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్‌పీఎం సరిచేసుకుంటే తాలు రాదు

సారంగాపూర్, ఏప్రిల్ 6: వరి పంట కోత సమయంలో హార్వెస్టర్‌లో ఆర్‌పీఎం సరిచేసుకుంటే తాలు తప్ప రాదని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారులు అనూష, సందీప్ రైతులకు సూచించారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లిలో హార్వెస్టర్ ఓనర్లు, డ్రైవర్లు, రైతులకు హార్వెస్టర్ ఆర్‌పీఎం గురించి అవగాహన కల్పించారు. వరి పంటలో మొగి పురుగు, మెడ విరుపు తెగులు వల్ల కొంతమేర తాలు తప్ప గింజలు వచ్చే అవకాశం ఉందన్నారు. వరి పంట కోత సమయంలో హార్వెస్టర్ ఆర్‌పీఎంను 18–19 పెట్టడం వల్ల తాలు గింజలు వేరు అవుతాయని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసు కొచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలతో ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

జగిత్యాల, ఏప్రిల్ 6: ఎన్నికల నిర్వహణలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. బీపీ, మధుమేహం, ఓపెన్ హార్ట్ సర్జరీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, దివ్యాంగులు, గర్భిణులు, ఫీడింగ్ అందించే మహిళలు, 58 ఏళ్ల పైబడిన వారికి లోక్‌సభ ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు రిపోర్టు చేయడానికి వెళ్లేవారికి ప్రత్యేక బస్సులు కేటాయించాలన్నారు. శిక్షణ సమయంలో ఈవీఎంలపై పూర్తిస్థాయి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు, జిల్లా ప్రధానకార్యదర్శి నరుకుల శ్రీధర్, రాజు జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

కోరుట్ల, ఏప్రిల్ 6: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వేసవి కాలంలో రెండు పూటల పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు శనివారం మండల విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వేసవికాలం దృష్ట్యా ఒంటిపూట బడులు నిర్వహించాలని జీవో జారీ చేసినప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రెండు పూటల పాఠశాల నిర్వహించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ రంజిత్, రాఘవేంద్ర, మణికుమార్, మణిదీప్, పవన్, లక్ష్మణ్, సాయి, తదితరులున్నారు.